క్లుప్తంగా

ఇంటర్మీడియేట్‌లో అడ్మిషన్లు ప్రారంభం

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి, రెండో సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001లో ప్రారంభమైన ఈ కళాశాల అనుభవనీయులైన అధ్యాపకుల స్వీయ పర్యవేక్షణలో ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక ప్రయోగశాల డిజిటల్ తరగతులు ఉచిత పాఠ్యపుస్తకాలు అతితక్కువ ఫీజుతో విద్యాబోధన చేస్తున్నామని వివరించారు. ఎంపీసీ, బైపీసీ తెలుగు ఇంగ్లిషు మీడియంలో సీఈసీ తెలుగు మీడియంలో చేరే విద్యార్థులు పదోతరగతి పరీక్షల హాల్ టికెట్‌తో అడ్మిషన్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98662 05026 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: చీరాల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వీరరాఘవస్వామి దేవాలయం వద్ద మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్వహించనున్న చలివేంద్రాన్ని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కట్టా రాజ్‌వినయ్‌కుమార్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు, ఉపాధ్యక్షులు సింహాద్రి యల్లమందారెడ్డి, ఎ.రామారావు, శివకుమార్, ఆంజనేయులు, దశరథరామయ్య, మునీరుల్లాఖాన్, వెంకటేశ్వర్లు, బీరం సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకు ఫ్యాన్‌ల బహూకరణ

పర్చూరు(చినగంజాం): మండలంలోని నాగులపాలెం గ్రామంలోని నాగుబడి రంగమ్మ అచ్చమ్మ బధిరుల పాఠశాల విద్యార్థులకు దాతలు ఫ్యాన్‌లు బహుకరించారు. విద్యార్థులకు ఉపయోగపడే రెండు సీలింగ్ ఫ్యాన్‌లను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యద్రంవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల వీరారెడ్డి జ్ఞాపకార్థం భార్య నిర్మలాదేవి బహూకరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉగాది వేడుకలు నిర్వహించి, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత


తూర్పుతక్కెళ్లపాడులో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

జే.పంగులూరు: ఓటు హక్కు వినియోగించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత, అది శాంతియుత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలని రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని అలవలపాడు, తూర్పు తక్కెళ్లపాడు, తూర్పు కొప్పెరపాడు మంగళవారం ఎస్సై కేకే తిరుపతిరావు, 25 మంది కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహించారు

వాహనాల తనిఖీలు..

వేటపాలెం: మండలం పరిధిలోని దేశాయిపేట గ్రామంలో వివిధ ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి వాహనాలు తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించి ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్సై జీ సురేష్ మాట్లాడుతూ రాబోవు సాధారణ సార్వత్రిక ఎన్నికల్లో బాగంగా దేశాయిపేట పంచాయతీ పరిధిలోని సిలోన్ కాలనీ, జీవరక్షానగర్, ఆణుమల్లిపేట, రామనగర్, చిన్నబజార్ రూట్ మార్చ్ నిర్వహించామని తెలిపారు.


పందిళ్లపల్లిలో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

బల్లికురవలో నేడు ప్రతిష్ఠ వేడుకలు

బల్లికురవ: బల్లికురవలో వరసిద్ధి వినాయక స్వామి వాయుప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ జరిగిన 43 రోజులు అయిన సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన చింతలపాటి హరి సూర్యసుబ్రమణ్య సిద్ధాంతిచే విఘ్నేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ చేపడుతున్నారని, ఈ వేడుకల్లో గ్రామంతో పాటు పరిసరగ్రామాల భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


పంచాంగ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి


మార్టూరులో పంచాంగ శ్రవణానికి హాజరైన మహిళలు


మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితుడు

ఉగాది వచ్చెను.. సంతోషం తెచ్చెను

ఉగాది అంటే అందరికి గుర్తుకు వచ్చేది తెలుగు వారి పండుగ. తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి ఇది తెలుగు వారి పండుగ గుర్తింపు తెచ్చుకుంది. చైత్రశుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈపర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. వేదాలను హరించిన సోమకుడిని వధించి మత్స్యావతారం ఎత్తిన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణంలో విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి. నూతన ఏడాదిలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈఏడాది మంగళవారం క్రోధి నామ సంవత్సరంగా మన పిలుస్తున్నాం. ఇంటిల్లిపాది షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసుకుని ఆనందంగా గడిపారు.

- క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం
- షడ్రుచులతో ఉగాది పచ్చడి
- సందడి చేసిన యువత, చిన్నారులు
- దేవాలయాల్లో పంచాంగ శ్రవణం

యద్దనపూడి/కారంచేడు/చినగంజాం/మార్టూరు: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తమ లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించుకొని ఇంటిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి విశేషపూజలు చేశారు.

■ కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలతో పాటు షడ్రుచులతో కూడాని ఉగాది పచ్చడిని కూడా అందించారు.

■ చినగంజాంలో భూ సమేత భావన్నారాయణ స్వామి ఆలయలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఉయ్యాల సేవ, భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

■ మార్టూరులో క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకొని సోమవారం అర్ధరాత్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. మహిళలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు.

కోలాహలంగా క్రోధి నామ సంవత్సరం..

మేదరమెట్ల/అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ: తెలుగు ప్రజలు నూతన సంవత్సరంగా భావించే ఉగాది పండుగను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొరిశపాడు మండలంలోని పలు వైష్ణవ దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. దేవస్థానంలో స్వామివారి భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలను సమర్పించారు.

ఉగాది అందరికి శుభప్రదం కావాలి

బల్లికురవ: క్రోధి నామ సంవత్సర ఉగాది నుంచి సరికొత్త ఆశలు నందాలతో అందరికి ఆనందం కావాలని గుంటుపల్లి చిన అంబడిపూడి గ్రామాల్లోని ఆలయాల ప్రధాన అర్చకుడు జీ. పవన్‌కుమార్, పీ. లక్ష్మీ వరప్రసాదరావు అన్నారు. సాయంత్రం గ్రామంలోని గంగా అన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, చినఅంబడిపూడి గ్రామంలోని గంగా పార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేపట్టారు. ఈఏడాది పండేపంటలు, వాటి ధరలు ఆదాయ వ్యయాలను రైతులకు వివరించారు. బల్లికురవ, చెన్నుపల్లి, కొణిదెన, ముక్తేశ్వరం, కొండాయపాలెం, కొత్తమల్లాయపాలెం, కూకట్లపల్లి గ్రామాల్లో జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి విగ్రహం


ఘనంగా ఉగాది పర్వదినం..

వేటపాలెం: వివిధ దేవస్థానాల్లో ఉగాది పర్వదినం వేడుకలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఆణుమల్లిపేటలోని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు పంచాంగ విశిష్టత శ్రవణం ఉగాది విశిష్టత గురించి వివరించారు. అనంతరం అర్చక స్వాములు కారంచేటి చంద్రశేఖరావు, రావూరి కృష్ణబాబులను దుశాలవతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వల్లంపట్ల మురళీకృష్ణమూర్తి, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, ప్రత్తి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాల మదనగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఉత్సవ మూర్తులను పట్టణంలో ఊరేగించారు. అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలానే పట్టణంలోని వీర రాఘవస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులను పట్టణంలో నగరోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

శివాలయంలో హనిమిరెడ్డి ప్రత్యేక పూజలు..

క్రోధి నామ ఉగాది సంవత్సరం సందర్భంగా మంగళవారం అద్దంకి పట్టణంలోని పాత శివాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధర్మవరపు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రోధి నామసంవత్సర పంచాంగ పుస్తకాలను ఆవిష్కరించి, ప్రతులను అందజేశారు. దీనిలో భాగంగా దేవస్థాన సిబ్బంది హనమిరెడ్డిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మేష్, వార్డు కౌన్సిలర్‌లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


చింతపల్లిపాడులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు శ్రీనివాసాచార్యులు


చినగంజాంలో 108 కలశాలతో పూజ నిర్వహిస్తున్న అర్చకులు


ఉగాది విష్టతను వివరిస్తున్న పండితుడు చంద్రశేఖరావు

సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి..

అద్దంకి: క్రోధి నామ సంవత్సర ఉగాది నుంచి ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని గుంటూరు సుబ్బరాయశాస్త్రి అన్నారు. మంగళవారం సాయంత్రం ఉగాది సందర్భంగా జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేపట్టారు. ఈ యేడాది అన్ని రాశుల వారి ఆదాయ వ్యయాలను, రాజపూజ్యాలతో పాటు పంటలు, ధరల వివరాలు, రాష్ట్ర దేశ పరిస్థితులను వివరించారు. పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని దేవస్థాన సహాయ కమిషనర్‌గా సుభద్ర పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.


శింగరకొండ దేవస్థానంలో పంచాంగ శ్రవణం చేస్తున్న సుబ్బరాయశాస్త్రి


గుంటుపల్లి శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు


మేదరమెట్లలో భజన చేస్తున్న భక్త బృందం

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- దేవాంగపురిని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం
- ఆత్మీయ సమావేశంలో అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్


పథకాలను మహిళలకు వివరిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్


ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

చీరాల: గడిచిన ఐదేళ్లలో చీరాల నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో ముందంజలో నిలిపాం.. ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి సహకరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో ఆత్మీయ సమావేశాన్ని గ్రామస్తులతో నిర్వహించి తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రణాళికా బద్ధంగా పనిచేయండంతో అభివృద్ధిలో ముందంజలో నిలిపామన్నారు. దేవాంగపురి గ్రామ పంచాయతీలో గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం, మౌలిక వసతులు కల్పించి ప్రజలందరికి అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటుగా ప్రజల సంక్షేమానికి బృహత్తర పథకాలు అందించిన సీఎం జగనన్న మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపీ నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. చీరాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనను గెలిపించి సీఎం జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని అందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. గత పాలకులు విస్మరించినప్పటికి దేవాంగపురిని విస్మరించినప్పటికి శాశ్వతంగా అభివృద్ధి పనులతో పాటుగా పెండింగ్ పనులను పూర్తి చేశామన్నారు. దీంతో గ్రామస్తులు అందరూ తమకు అన్నీ విధాలుగా అండగా నిలుస్తున్న వెంకటేష్ గెలుపునకు తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాసిక హనుమంతరావు, మాచర్ల హేమంత్, పింజల శ్రీమన్నారాయణ, అలుగురి శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, సత్యనారాయణ, కరుణ, రాజశేఖర్, పరమేశ్వరరావు, లోకేష్‌తో పాటుగా మండల పార్టీ అధ్యక్షులు అంకాళరెడ్డి, ధనుంజయ్, జయరావ్ తదితరులు ఉన్నారు.


వెంకటేష్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

పథకాలతో ఆర్థికంగా నిలబడ్డాం

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తాము ఆర్థికంగా నిలదొక్కుకున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామంలో మంగళవారం మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బిజ్జి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల కరపత్రం అందించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అద్దంకిలో హనిమిరెడ్డి వైఎస్సార్ సీపీ తరుపున అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గాదే బ్రహ్మరెడ్డి, గ్రామ నాయకులు తిరుమలరాజు, భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడులో మంగళవారం కోదండరామస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న కోదండ రామ సీతా లక్ష్మణ సమేత విగ్రహాలకు ఘనంగా ఉగాది గ్రామోత్సవం నిర్వహించారు. వేమా సుబ్బారావు అండ్ సన్స్ ఈ ఉగాది గ్రామోత్సవానికి దాతలుగా వ్యవహరించారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం


హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరిన అనిల్ చౌదరి, కుమార్‌బాబు

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక

జే.పంగులూరు: నియోజకవర్గంలో ఫ్యాన్ జెండా ఎగరడం ఖాయమని అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. బల్లికురవ, జే పంగులూరు మండలాల నుంచి మంగళవారం అద్దంకి పార్టీ కార్యాలయంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి నాయకులు చేరారు. వీరికి హనిమిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బల్లికురవ మండలం కే రాజుపాలెం నుంచి టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ జాష్టి అనిల్ చౌదరి, పంగులూరు మండలం నుంచి గ్రామ టీడీ నాయకుడు జంపాని కుమార్‌బాబు పార్టీలోకి చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత


క్రీడాకారిణిలను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన 12 మంది క్రీడాకారిణిలకు ఇంటర్నేషనల్ వాకర్స్ ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం స్థానిక హైస్కూలు క్రీడా మైదానంలో నూతన క్రీడా దుస్తులు టీషర్టులు, నిక్కర్లు, సాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారుగుళ్ల గురుప్రసాద్‌లు మాట్లాడారు. విద్యార్థినులు ఒకవైపు కష్టపడి మంచిగా చదువుతూ మరోవైపు క్రీడల్లో కూడా అనేక పతకాలు సాధించారని చెప్పారు. మరిన్ని పోటీలలో పాల్గొని పతకాలు సాధించి మన దేశానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ వేణు, ట్రెజరర్ గొడవర్తి సుధాకరరావు, అమరా వీరాంజనేయులు, వలివేటి మురళీ కృష్ణ, గుర్రం బదరి, పచ్చిపులుసు వెంకటస్వామి, నారాయణ మూర్తి, డిఎస్. లాల్, ఐ. సుభాషిణి, తిరుపతిరావు, చింతా రమేష్, శివాంజనేయ ప్రసాద్, పూర్ణచంద్రరావు, భాస్కర్‌రావు, దరియాసాహెబ్, మధుసూదన రావు, తదితరులు పాల్గొన్నారు.